


తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,100
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,279
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	31	18
చిత్తూరు	31	17
తిరుమల	26	13
గూడూరు	31	20
నగరి	32	18



సామూహిక అక్షరాభ్యాసం రేపు

కాణిపాకం(యాదమరి): వసంత పంచమిని పురస్కరించుకుని గురువారం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్టు చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రమాదాల నివారణపై అవగాహన



డ్రైవర్లకు డీజిల్ ఆదాపై అవగాహన కల్పిస్తున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: డీజిల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిడ్రైవర్ ఆదాచేయాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి సూచించారు. తరచూ ప్రమాదాలు చేస్తున్న డ్రైవర్లు, డీజిల్ ఆదా చేయని డ్రైవర్లకు మంగళవారం స్థానిక డీపీటీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 11 డిపోల పరిధిలో తరచూ కొందరు ప్రమాదాలు చేస్తున్నారన్నారు. మరోవైపు డీజిల్ ఆదాచేయడంలో ప్రతి నెలా చివరి వరుసలో ఉంటున్న డ్రైవర్లను ప్రశ్నించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆదాయం కోసం అన్వేషిస్తున్నామని, ఉద్యోగుల సహకారం ఉంటేనే అది సాధ్యమవుతుందని తెలిపారు.

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి



నేలపట్టులో వైల్డ్‌లైఫ్ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ

దొరవారిసత్రం: పక్షుల కేంద్రాల్లోకి సందర్శకులు తీసుకువచ్చే వాటర్‌బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లు తదితరాలను నిషేధానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని వైల్డ్‌లైఫ్ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ శాంతి ప్రియాపాండ్య ఆదేశించారు. ఆమె మంగళవారం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రంలో విడిది చేసే విహంగాలను తిలకించి, పర్యావరణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పర్యాటకుల కోసం ఎలాంటి వసతులు కల్పించారు.. వలస విహంగాల కోసం ఆహారం కొరత ఏర్పడకుండా ఎలాంటి చర్యలు చేపట్టుతున్నారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రాన్ని సందర్శించే వారి నుంచి అభిప్రాయాలను రిజిస్టర్ ఏర్పాటు చేసి తీసుకోవాలని స్థానిక అధికారులకు ఆమె ఆదేశించారు. సూళ్లూరుపేట డీఎఫ్‌ఓ శామ్యూల్, రేంజర్ ఆఫీసర్ వరప్రసాద్, ఎఫ్‌ఆర్‌ఓ బాలయ్య పాల్గొన్నారు.

సెంటు భూమి అన్యాక్రాంతం కానివ్వం



మాట్లాడుతున్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి సెంటు భూమిని కూడా అన్యాక్రాంతం కానివ్వమని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలనా భవనంలో మంగళవారం పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఇటీవల టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి సర్వే నం.292లో 4.3 ఎకరాలను వైఎస్సార్‌సీపీ నాయకులు సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారంటూ చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. దాత రామనాథం చెట్టియార్ నందనవనం ట్రస్టు పేరిట ఆ భూమిని ఆలయానికి విరాళంగా ఇచ్చారని, అయితే ఆ భూమి తమకు చెందిందని ఆరుగురు కోర్టుకు వెళ్లగా అందులో ఐదుగురికి సంబంధించిన అప్పీళ్లను కోర్టు కొట్టేసిందని తెలిపారు. ఇందులో చిరంజీవులునాయుడు అనే వ్యక్తిది మాత్రమే పెండింగ్‌లో ఉందని, న్యాయపరంగా దీనిని పరిష్కరించి దాత అభీష్టం మేరకు ఆ భూమిని ఆలయ నిత్యపూజలకు వినియోగిస్తామన్నారు. పాలకమండలి సభ్యులు సాధన మున్నా, జయశ్యామ్, ప్రత్యేక ఆహ్వానితులు పాలమంగళం నీల, వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లూరు హరినాయుడు, పాలమంగళం రవి, పసల కుమారస్వామి, గోపిగౌడ్ పాల్గొన్నారు.

ఈనెలలోపు వ్యవసాయ సర్వీసులు

చిత్తూరు కార్పొరేషన్: గత ఏడాది ఆగస్టులోపు వ్యవసాయ సర్వీసుల కోసం డబ్బులు కట్టిన రైతులకు ఈనెలలోపు సర్వీసులు ఇవ్వాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన ఈఈ, డీఈ, ఏఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న లే అవుట్లలో ఇళ్లకు త్వరితగతిన విద్యుత్ సర్వీసులు ఇవ్వాలన్నారు. శాఖల పరంగా ఉన్న విద్యుత్తు బకాయిలను చెల్లించాలని సంబంధిత అధికారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. ఈఈ హరి, ఇన్‌చార్జి ఈఈ పాల్గొన్నారు.

బర్డ్‌లో రక్తనిధి



- నేటి నుంచి అందుబాటులోకి రానున్న అత్యాధునిక ల్యాబ్
- మరింత విస్తరించిన బ్లడ్‌బ్యాంక్
- దాతలు, టీటీడీ సహకారంతో సమకూరిన వైనం
- ప్రారంభించనున్న టీటీడీ ఈఓ

బర్డ్‌ను ఏళ్లతరబడి వేధిస్తున్న ల్యాబ్ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. దాతల సహకారంతో టీటీడీ బ్లడ్‌బ్యాంక్‌ను మరింత అధునికీకరించింది. అత్యాధునిక సీటీ స్కానింగ్, ఎక్స్‌రే, ఇతర వైద్యపరీక్షలను ఒకేచోట కేంద్రీకృతం చేసింది. కోట్ల రూపాయలు వెచ్చించి ఆధునిక వైద్యపరికరాలు సమకూర్చింది. ఆస్పత్రికి వచ్చిన రోగి బయటకు వెళ్లి ఇబ్బందులు పడకుండా అన్నింటినీ అందుబాటులోకి తేవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

తిరుపతి తుడా: టీటీడీ బర్డ్ ఆస్పత్రి కొత్త పుంతలు తొక్కుతోంది. గతానికి భిన్నంగా ఆధునిక పరికరాలతో రోగులను ఆకట్టుకుంటోంది. అత్యాధునిక సెంట్రల్ ల్యాబ్, రక్తనిధిని అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిని బుధవారం టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి, బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి ప్రారంభించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.

ఆధునిక పరికరాలు.. అత్యాధునిక సౌకర్యాలు

బర్డ్ ఆస్పత్రిలో వైద్య సేవలను మరింత విస్తృతం చేస్తూ టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రోగుల కోసం ఇటీవల అత్యాధునిక సీటీ స్కాన్, ఎక్స్‌రే సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అలానేగే ఓపీ సేవలు సులభంగా పొందేందుకు పలు సంస్కరణలు అమలు చేశారు. ఆస్పత్రిలో



సెంట్రల్ ల్యాబ్

ల్యాబ్ అవసరాన్ని గుర్తించి శరవేగంగా ఏర్పాటు చేశారు. ఆరు నెలల వ్యవధిలోనే సుమారు కోటి రూపాయలకు పైగా వెచ్చించి సెంట్రల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చారు. బయోకెమిస్ట్రీ, హిమటాలజీ సంబంధిత అన్ని వైద్య పరీక్షలతోపాటు మైక్రోబయాలజీ, పెథాలజీ ల్యాబ్‌ను నిర్మించారు. అలాగే బ్లడ్ బ్యాంక్‌ను ఆధునికీకరించి మరింతగా రక్త నిధిని సమకూరేలా ఏర్పాట్లు చేపట్టారు. రోగులకు ఒకేచోట వైద్యంతో పాటు సంబంధిత రక్త పరీక్షలు లభించడంతో పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా రోగులు, వారి సహాయకులు ఉండేందుకు అధునాతన సదుపాయాలు సైతం కల్పించారు.

గతంలో నరకం

గతంలో బర్డ్‌కు వచ్చిన రోగికి సవాలక్ష సమస్యలు ఎదురయ్యేవి. చికిత్సకు ముందు వివిధ రక్తపరీక్షలు అవసరం ఉండడంతో అధికారులు స్లిప్పులు రాసి బయటకు పంపేవారు. దీనికితోడు మ్యానువల్‌గా ఓపీలు తీసుకునే వెసులుబాటు ఉండడంతో ముందు రోజు నుంచే రోగులు క్యూలో నిరీక్షించాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా టీటీడీ అవసరమైన సదుపాయాలు సమకూర్చింది.

బర్డ్ ఆస్పత్రి సమాచారం

రోజువారి ఓపీలు	శస్త్ర చికిత్సలు
300-350	15-20
ఎక్స్‌రేలు	**సీటీ స్కాన్**
240-260	10-15
రక్త పరీక్షలు	**అవసరమయ్యే రక్తం**
100-150	20-22 యూనిట్లు
రక్త సేకరణ	
10-15	

అందుబాటులోకి క్లౌడ్ టెక్నాలజీ



బర్డ్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యసదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చాం. సిటీ, ఎక్స్‌రేతో పాటు సెంట్రల్ ల్యాబ్, బ్లడ్ బ్యాంక్ వంటి వాటిని ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో మరెక్కడా లేని వైద్య పరికరాలు బర్డ్‌లో సమకూర్చాం. తక్కువ ధరకే బయల రోగులకు సైతం సీటీ, ఎక్స్‌రే సేవలు అందిస్తున్నాం. ల్యాబ్ సేవలను ఇతర రోగులు వినియోగించుకోవచ్చు. రెండ గంటల్లోపే రక్త పరీక్షల ఫలితాలను సంబంధిత రోగి, డాక్టర్ మొబైల్‌కు క్లౌడ్ టెక్నాలజీ ద్వారా మెసేజ్ అందేలా చర్యలు చేపట్టాం.

– డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి, ప్రత్యేకాధికారి, బర్డ్ ఆస్పత్రి

ఓటర్ల పండగ



- నేడే ఓటర్ల దినోత్సవం
- పలు కార్యక్రమాలకు శ్రీకారం
- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

తిరుపతి అర్బన్: ఓటర్ల దినోత్సవానికి అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పలు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించనున్నారు. ఆయా మండల తహసీల్దార్లు, ఆర్డీఓ కార్యాలయాల పరిధిలో కార్యక్రమాలు చేపట్టడానికి సర్వం సిద్ధం చేశారు. కొత్తగా ఓటుహక్కు పొందిన వారికి ఓటర్ కార్డులను ఇవ్వనున్నారు. శతాధికవృద్ధులను ఘనంగా సన్మానించనున్నారు.

మహిళా ఓటర్లే అధికం

తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 17,27,576 మంది ఓటరుకుండగా.. ఇందులో పురుషులు 8,47,343, స్త్రీలు 8,79,992, ట్రాన్స్ జెండర్లు 241 మంది ఉన్నారు. జిల్లా మొత్తంగా 30వేల మందికిపైగా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మరోవైపు 194 మంది శతాధిక వృద్ధులు, 90–99 ఏళ్ల మధ్య వారు 2,305, 18–19 ఏళ్ల వయసు వారు 13,477 మంది ఉన్నారు.

ఉత్తమ అవార్డులకు 25 మంది ఎంపిక

ఓటర్ల సవరణకు సంబంధించి ఉత్తమ ప్రతిభకనబరిచిన 25 మంది అధికారులు ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి బుధవారం తిరుపతి ఎస్వీయూనివర్సిటీ పరిధిలోని సెనెట్ హాల్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డులు అందజేయనున్నారు. ఇందులో ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓ, ఈడీటీకి సంబంధించి తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి, డెప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, గూడురు ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ జీఎస్‌ఎస్‌ఎస్ వెంకటగిరి ఎం.శ్రీనివాసులు, తిరుపతి ఆర్డీఓ వీ.కనకనరసారెడ్డి, చంద్రగిరి తహసీల్దార్ శిరీషా, శ్రీకాళహస్తి ఆర్డీఓ కేఎస్ రామరావు, తహసీల్దార్ షేక్ జరినా, సత్యవేడు నుంచి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.శ్రీనివాసరావు, తిరుపతి డిప్యూటీ తహసీల్దార్ ఎం. విజయభాస్కర్ ఉన్నారు. అలాగే ఎన్నికల ఓటర్ల జాబితాకు సంబంధించి సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు, ఆపరేటర్లను జిల్లా స్థాయి అవార్డులకు ఎంపిక చేశారు. ఇందులో వై.శ్రీనివాసరావు, సీహెచ్.నాగరాజు, ఈ.సందీప్, టీ.కామేశ్వరి, ఎస్‌కే.షరీఫ్, పీ.శ్రీనివాసులు, వెంకటనరేష్, బీ.శైలజ, బీ.రాజేష్, ఎస్‌కే ప్రక్రుద్దీన్, పీ.గురుస్వామి, సీహెచ్ శారద, జీ.పవన్‌కుమార్, కే.అనీల్‌కుమార్, హరికిషోర్, వీరేషమ్మ, సతీష్, నాగలక్ష్మి, ప్రతాప్‌నాయక్, వినిత, శశికుమార్, సాయికుమార్, శివకుమార్, విజయలలిత, వెంకటేశ్వర్లు, సురేష్, జానకీరామన్, నిహారిక తదితరులు ఉన్నారు.

బీఎల్‌ఓకు రాష్ట్రస్థాయి అవార్డు



కేజీ నీలుఫర్

ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సమర్థవంతంగా పనిచేసినందుకు తిరుపతిలోని ఎంఆర్‌పల్లి పోలింగ్ స్టేషన్ 244 బీఎల్‌ఓ కేజీ నీలుఫర్‌కు ఉత్తమ అవార్డు దక్కింది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ – 2023లో ప్రతిభ చూపడంతో బూత్‌లెవెల్ ఆఫీసర్ బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకోనున్నారు.

అందరూ పాల్గొనాలి



ఓటర్ల దినోత్సవంలో అంతా భాగస్వాములు కావాలి. బుధవారం ఉదయం 10 గంటలకు తిరుపతి కొత్త మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుంది. యూనివర్సిటీ ఆడిటోరియంలో ఓటర్ల దినోత్సవంపై అవగాహన సదస్సు ఉంటుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులు అందజేస్తాం. అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– కే.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి

పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు

- సత్యవేడులో మెగా జాబ్‌మేళా
- 141 మందికి ఉద్యోగాలు
- త్వరలో శ్రీసిటీలో నైపుణ్యాభివృద్ధి కళాశాల ప్రారంభం
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడి



మెగా జాబ్‌మేళాలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: ప్రైవేటు పరిశ్రమల్లో సైతం స్థానికులకు 75శాతం ఉద్యోగాలు కల్పించాలన్న చట్టాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. అంతేగాక త్వరలోనే నిరుద్యోగులైన యువతీయువకులకు నైపుణ్యాన్ని పరిశ్రమల ఉత్పత్తులకు అనుగుణంగా పెంపొందించేందుకు నియోజకవర్గ పరిధిలోని శ్రీసిటీ పారిశ్రామికవాడలో నైపుణ్యాభివృద్ధి కళాశాలను ఏర్పాటు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉద్యోగ మేళాను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గపరిధిలో దేశంలోనే అత్యున్నత పారిశ్రామికవాడగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీసిటీ సెజ్ ఉండడం ఈ ప్రాంత నిరుద్యోగ యువతీయువకులకు ఒక వరమన్నారు. 2వేల ఉద్యోగాలు ఏర్పాటు దిశగా సత్యవేడులో మెగా ఉద్యోగ మేళాను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. గతంలో బాబు వస్తే జాబు వస్తుందన్న ప్రచారంతో చంద్రబాబు గద్దె నెక్కి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా నిరుద్యోగ యువతను నిలువునా ముంచేశారని ధ్వజమెత్తారు. నేడు రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగనన్న పనిచేస్తున్నారని, అందుకు నిదర్శనం సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు అవడమేనని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ మేళాలో శ్రీసిటీకి చెందిన 15 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 254 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. అందులో 141 మందిని వివిధ పరిశ్రమల్లో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు జాబ్ మేళా కో–ఆర్డినేటర్ దీప పేర్కొన్నారు. వారికి ఉన్నతమైన వేతనాలు అందనున్నట్లు పేర్కొన్నారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సుశీల్ కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్ట్ రమేష్, సోమశేఖర్, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి శ్యామ్‌మోహన్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ ఉమ్మడి జిల్లా అధికారి పద్మజ, డీఆర్‌డీఏ ఏపీఎం సుదర్శన్ రాజు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుదాదేవి, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ బాలగణేష్ తదితరులు పాల్గొన్నారు.

'పాదయాత్రలో లోకేష్‌కు పరాభవం తప్పదు'



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : నారా లోకేష్ పాదయాత్రకు పూనుకోవడం ఏ దేవుడికి ప్రీతి? అని డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి కే.నారాయణస్వామి ప్రశ్నించారు. మంగళవారం పాలసముద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర చేస్తే ప్రజలు నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు తన స్వార్థం కోసం చిత్తూరు డెయిరీ, షుగర్ ఫ్యాక్టరీలను మూసి వేయించాడని, దీనిపైనే కాకుండా టీడీపీ హయాంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో పాదయాత్రలో లోకేష్‌కు ప్రజల నుంచి పరాభవం తప్పదని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.శివ ప్రకాష్ రాజు, పార్టీ మండల కన్వీనర్ తులసియాదవ్, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్, పుష్ప, ఎంపీటీసీ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

వేద భాష్యం.. సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న సత్యవాగేశ్వర ఘణపాఠి

తిరుపతి అలిపిరి: శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయంలో వేదభాష్య విభాగ ఆధ్వర్యంలో యజుర్వేదంలో ఉన్న 'అగ్న్యాధాన ప్రక్రియ, యజుర్వేదే అగ్న్యాధాన ప్రకరణ విచారః' అనే అంశంపై రెండు రోజుల సదస్సు జరిగింది. విశ్వవిద్యాలయ పరిపాలనా సమావేశ భవనంలో కులపతులు ఆచార్య రాణి సదాశివమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా చెన్నైకి చెందిన ప్రముఖ వేదభాష్య పండితులు సత్యవాగేశ్వర ఘణపాఠి, టీటీడీ ఉన్నత వేదాధ్యయన సంస్థ సంచాలకులు విభీషణశర్మ, కంచికాభాషణం నిమిత్తం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఆచార్యులు కుప్పా.విశ్వనాథ శాస్త్రి పాల్గొన్నారు. అనంతరం సంయోజకులు ప్రవ్వా రామకృష్ణ సదస్సు లక్ష్యాన్ని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాఏ.రాధేశ్యాం, వేదభాష్య అధ్యాపకులు శ్రీనాథ్‌శర్మ, పీఆర్వో డాటి బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ

శ్రీకాళహస్తి రూరల్: నిరుపేదల వలసలు నివారించడానికి ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ సూచించారు. మండలంలోని అమ్మపాళెం పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ కూలీలు పనులు అడిగిన వెంటనే కల్పించాల్సిన బాధ్యత క్షేత్రసహాయకులపై ఉందన్నారు. అలాగే కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో కృష్ణయ్యను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు తమకు గిట్టుబాటు కూలీ లభించడంలేదని పీడీ దృష్టికి తీసుకువచ్చారు. చిన్నపాటి గాయాలు తగిలితే ప్రథమ చికిత్స బాక్స్‌లు కూడా లేవని వాపోయారు. పీడీ స్పందిస్తూ కూలీలు రోజుకు కనీసం నాలుగు గంటలు కష్టపడితే రూ.257 గిట్టుబాటు కూలీ లభిస్తుందన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, సిబ్బంది నాగరాజు, మునిరత్నమ్మ పాల్గొన్నారు.

ఆర్‌బీకే, సచివాలయాల పనితీరు భేష్



చిత్తూరులోని ఇండియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో వస్త్ర చిత్రకళను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

చిత్తూరు అగ్రికల్చర్: రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే), గ్రామీణ సచివాలయాల పనితీరు బాగుందని కేంద్ర బృందం ప్రశంసించింది. జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల తీరును పరిశీలించేందుకు మంగళవారం రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఆఫ్ ఒడిశాకు చెందిన కేంద్ర బృందం సభ్యులు శిశిర్ కుమార్ సాహు, సత్యబ్రాత్ బెహ్రా జిల్లాకు విచ్చేశారు. ఈ బృందం పదిరోజుల పాటు జిల్లాలో పర్యటించి, కేంద్ర ప్రభుత్వ పథకాలైన జాతీయ ఉపాధి హామీ, సామాజిక పింఛన్లు, ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన, గ్రామీణ సడక్ యోజన్..ఇత్యాది వాటి పనులను పరిశీలించనుంది. స్థానిక డ్వామా కార్యాలయ సమావేశ మందిరంలో బృంద సభ్యులు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం నగరంలోని ఇండియన్ బ్యాంకు నిర్వహిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. వస్త్ర చిత్రకళా, ఎంబ్రాయిడరీ తదితర ఉపాధి పనులపై యువత పొందుతున్న శిక్షణను పరిశీలిచారు. అక్కడ నుంచి పెనుమూరు మండలం కలికిరి పంచాయతీలోని గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను సందర్శించి వాటి పనితీరును, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని సదుపాయాలను ప్రజలకు, రైతులకు అందుబాటులోకి తీసుకు వచ్చిన విధానం చాలా బావుందని కితాబిచ్చారు. కలికిరి, పెద్దకలికిరి, గొల్లపల్లె గ్రామాల్లో బృంద సభ్యులు పర్యటించి సామాజిక పింఛనుదారులు, డ్వాక్రా మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఉపాధి కింద చేపడుతున్న పండ్ల తోటల పెంపకం, అంతర పంటల సాగు తదితర పనులను పరిశీలించారు. 'అమృత్ సరోవర్' నీటి నిల్వ కుంటల ఏర్పాటు పనితీరు చాలా బాగుందన్నారు. కార్యక్రమంలో బృందంతో పాటు డ్వామా పీడీ గంగాభవాని, గృహ నిర్మాణ శాఖ పీడీ పద్మనాభం, అధికారులు పాల్గొన్నారు.

కళ్యాణ వెంకన్నకు బంగారు పతకాలు


దాత అందజేసిన బంగారు పతకాలు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారికి రెండు బంగారు పతకాలు తిరుపతికి చెందిన ఓ భక్తుడు మంగళవారం బహూకరించారు. ఆలయంలోని శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అలంకరించేందుకు రూ.7.80 లక్షల విలువైన ఆభరణాలను తయారుచేయించారు. ఆ ఆభరణాలను ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈఓ వరలక్ష్మికి దాత అందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

తిరుమల: తిరుమలలోని అదనపు ఈఓ క్యాంపు కార్యాలయమైన గోకులం విశ్రాంతి భవనం ప్రాంగణం జనవరి 26 గణతంత్ర వేడుకలకు ముస్తాబవుతోంది. ఇందులో భాగంగా ఉదయం 7 గంటలకు టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి జాతీయ జెండాను ఎగురవేయనున్నారు.

ఏ‘మార్చే’శాడు’!

- ఏటీఎం మార్చి రూ.90 వేలకుపైగా నగదు డ్రా
- లబోదిబోమంటున్న వృద్ధుడు
- నాయుడుపేటలో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు


బాధితుడు బద్ధి మునుస్వామి



నిందితుడు మార్చి ఇచ్చిన నకిలీ ఏటీఎం కార్డు


సీసీ కెమెరాలకు చిక్కిన నిందితుడి ఫొటోలు

నాయుడుపేటటౌన్: ఏటీఎం వద్ద నగదు డ్రాచేసుకునేందుకు వచ్చిన వృద్ధుడిని బురిడీ కొట్టించాడో దొంగ. వృద్ధుడి వద్ద ఉన్న ఏటీఎంను మార్చి అతని కోడలు బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.90,400 డ్రాసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు, అతని కుటుంబ సభ్యుల కథనం.. దొరవారిసత్రం మండలం, నెలపట్టు గ్రామానికి చెందిన బద్ధి మునుస్వామి(65) కోడలు పవిత్రకు జగనన్న ఇంటి నిర్మాణానికి సంబంధించిన నగదును ఇటీవల కెనరా బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమచేసింది. ఆ నగదుతోపాటు మరికొంత నగదు కలిపి మొత్తం రూ.లక్ష వరకు దాచుకున్నారు. ఈ క్రమంలో ఇంటి నిర్మాణానికి సంబంధించిన నగదు డ్రా చేసేందుకు ఈనెల 21న మునస్వామి తన కోడలు ఏటీఎం కార్డు తీసుకుని నాయుడుపేటకు వచ్చాడు. పట్టణంలోని దర్గావీధిలో ఉన్న ఎస్బీఐ ఏటీఎం వద్ద నగదు డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా.. అక్కడ పక్కనే ఉన్న గుర్తుతెలియని యువకుడు నగదు తీసిఇస్తానని నమ్మబలికాడు. ఆపై ఏటీఎం పిన్ నంబర్ తెలుసుకుని మొదటగా రూ.10 వేలు డ్రా చేసి ఇచ్చి తర్వాత నగదు రావడంలేదని చెప్పి చాకచక్యంగా వృద్ధుడి వద్ద ఉన్న ఏటీఎం కార్డు మార్చేశాడు. ఆపై అదేవిధంగా ఉన్న మరో కార్డు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత 22వ తేదీ మళ్లీ నగదు డ్రా చేసేందుకు మునుస్వామి కుమారుడు ఏటీఎం కార్డు తీసుకుని పరిశీలించగా.. అది కెనరా బ్యాంక్ బదులు బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ ఏటీఎం కార్డు ఉండడంతో కార్డు మారినట్లు గుర్తించాడు. వెంటనే దొరవారిసత్రం మండలకేంద్రంలోని బ్యాంక్ వద్దకు వెళ్లి విచారించగా.. పవిత్ర పేరుతో ఉన్న బ్యాంక్ ఖాతాలో పలుచోట్ల రూ.90,400 డ్రా చేసినట్టు సిబ్బంది గుర్తించారు. పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద ఉన్న ఏటీఎంలో రూ.30 వేలు, బూదనం టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న ఓ పెట్రోల్ బంకు, వరగలి జాతీయ రహదారి కూడలి సమీపంలో ఉన్న మరో పెట్రోల్ బంక్ వద్ద రూ.59,400 నగదును స్వైప్ మిషన్ ద్వారా తీసుకున్నట్టు గుర్తించారు. తర్వాత 22వ తేదీ కావలి బస్టాండు వద్ద ఉన్న ఏటీఎంలో వెయ్యి రూపాయలు డ్రా చేసినట్టు గుర్తించారు. నిందితుడు పెట్రోల్ బంక్‌ల వద్ద వచ్చిన మోటారు బైక్ ముందు, వెనుక నంబరు లేకుండా ఉండడాన్ని గుర్తించినట్టు బాధితులు తెలిపారు. ఈ విషయమై మునుస్వామి కోడలు పవిత్ర మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు చెరుకుని నిందితుడు సీసీ కెమెరాల్లో ఉన్న ఫొటోలను అందించారు. ఈ మేరకు సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలకు టెండర్లు

- ఫిబ్రవరి 10లోపు దరఖాస్తులకు చాన్స్
- 15 ఏళ్లపాటు లీజుకు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ విభాగానికి సంబంధించిన ఖాళీ స్థలాలను అద్దెకు ఇవ్వడానికి నిర్ణయించామని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆ మేరకు దరఖాస్తులను ఆయా డిపోల్లో స్వీకరించనున్నట్టు స్పష్టం చేశారు. ఫిబ్రవరి 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు తెరుస్తామని తెలిపారు. టెండర్లకు సంబంధించి పూర్తి వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీఎస్‌ఆర్టీసీ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో చూడవచ్చని, టెండరు దక్కించుకున్నవారు 15 ఏళ్ల పాటు లీజుకు దక్కించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం డిప్యూటీ సీటీఎం భాస్కర్ 9959225663లో సంప్రదించాలని సూచించారు.

ఖాళీ స్థలాల వివరాలు

కోట బస్ డిపో పరిధిలో: బిట్-1-2178 చ.గ, బిట్-2- 1648 చ.గ.

పుత్తూరు బస్‌డిపో పరిధి: బిట్-1- 2614 చ.గ, బిట్-2 -4162 చ.గ, బిట్-3-5179 చ.గ.

సత్యవేడు: బిట్-1-1694 చ.గ, బిట్-2-1404 చ.గ, బిట్-3-3098 చ.గ, బిట్-4-8615 చ.గ, బిట్-5-5179 చ.గ.

వెంకటగిరి: బిట్-1- 8712 చ.గ .

31లోపు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-2024లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 29న జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీ ఆఖరని విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు ప్రస్తుతం 5వ తరగతి (01-05-2011 నుంచి 30-04-2013 మధ్య జన్మించిన వారు) చదివే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. నవోదయ విద్యాలయంలో ఆధునిక విద్యతో పాటు కాలానికనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యనందిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 93999 76999, 86888 88802 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

తిరుమలలో అభివృద్ధి పనులు వేగవంతం

తిరుమల: తిరుమలలోని వెంగమాంబ బృందావనం అభివృద్ధి పనులను టీటీడీ వేగవంతం చేసింది. అందులో భాగంగా సమీపంలోని మత్రిమానుమిట్ట ప్రాంతంలో ఉన్న ఏడు నివాసాలను మంగళవారం రాత్రి టీటీడీ రెవెన్యూ, ఇంజినీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో తొలగించారు. స్థానికుల అంగీకారంతోనే వీటిని తొలగించినట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. బాధితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల రెవెన్యూ విభాగం ఏఈఓ భాస్కరనారాయణ చౌదరి, ఆర్‌ఐ యుగంధర్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయంలో ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ చైర్మన్ నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ చైర్మన్ నాగేశ్వరరావు, ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సౌత్ ఇండియా ఇన్‌చార్జి బాలకృష్ణ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు ఆశీర్వచనం అందించగా, అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఏపీ డిప్యూటీ చైర్మన్ కోటేశ్వరబాబు, ప్రధాన కార్యదర్శి కలవగుంట భరతరెడ్డి పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా - ఒకరి మృతి

- నలుగురికి తీవ్రగాయాలు

కావలి రూరల్(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న కారు లారీని ఓవర్‌టేక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొనడంతో రమణమ్మ (64) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం ఉదయం కావలిలోని గౌరవరం జాతీయ రహదారి వద్ద జరిగింది. ఎస్‌ఐ ఎం.వెంకట్రావు కథనం మేరకు.. తిరుపతి జిల్లా, దొరవారిసత్రం మండలం తనియాలి గ్రామానికి చెందిన సంచి శ్యామ్ అతని భార్య శ్రావణి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. శ్యామ్, అతని తల్లి రమణమ్మ, భార్య శ్రావణి, స్నేహితులు వేణు, భానుప్రకాష్‌తో కలిసి హైదరాబాద్‌లో ఇల్లు చూసేందుకు కారులో వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా గౌరవరం వద్దకు చేరుకోగానే కారు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టెక్ చేయబోయి డివైడర్ ఢీకొని బోల్తా పడింది. దీంతో రమణమ్మ అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. శ్యామ్ కుమారుడు రెండేళ్ల బాబు సురక్షితంగా బయటపడ్డాడు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

దాడి చేసి సెల్‌ఫోన్, నగదు అపహరణ

దొరవారిసత్రం: పోలిరెడ్డిపాళెం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బైక్‌పై ఆగి ఉన్న ఎం శివకృష్ణను అటుగా బైక్‌పై వెళుతున్న ముగ్గురు దుండగులు రాడ్‌తో దాడిచేసి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, కొంత నగదు అపహరించుకెళ్లిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాలయపల్లి మండలం, పిగిలాం గ్రామానికి చెందిన శివకృష్ణ ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆఫీసు పనిమీద బైక్‌పై సూళ్లూరుపేటకు వెళ్లి తిరిగి నాయుడుపేటకు వస్తున్న క్రమంలో పోలిరెడ్డిపాళెం గ్రామ సమీపంలో బైక్ ఆపాడు. అదే సమయంలో అటుగా బులెట్ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వచ్చి శ్రీకాళహస్తికి వెళ్లేందుకు అడ్రస్ అడిగినట్లు అడిగి అంతలోనే రాడ్‌తో అతనిపై దాడిచేశారు. ఆపై శివకృష్ణ వద్ద ఉన్న సెల్‌ఫోన్, కొంత నగదు అపహరించికుని పరారయ్యారు. దోపిడీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు పోలీసులకు పట్టుబడగా మిగిలి ఇద్దరూ పరారీలో ఉన్నారు. వీరందరూ చెన్నైలో వివిధ ప్రాంతాలకు చెందిన వసంత్, మనోజ్, విష్ణుగా పోలీసులు గుర్తించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరి అరెస్ట్


అదుపులోకి తీసుకున్న నిందితులతో ఎస్‌ఈబీ అధికారులు

గూడూరు: గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారంతో, దాడిచేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు గూడూరు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక రెండవ పట్టణం, జానికిరాంపేట ప్రాంతంలోని ఎస్‌ఈబీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. చిల్లకూరు మండలంలోని మన్నేగుంట గ్రామానికి చెందిన ఇరగరాజు వెంకయ్య, మణిమాల ప్రతాప్ అనే వారికి గంజాయి తాగడం అలవాటు ఉందన్నారు. వారు ఇంటి సమీపంలో గంజాయి సాగుచేస్తున్నారని తెలిపారు. దీనిపై సమాచారంతో దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ శేషమ్మ, ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత


నిందితుల అరెస్ట్ చూపించి గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

సూళ్లూరుపేట : శ్రీకాళహస్తి నుంచి సూళ్లూరుపేట పట్టణానికి మోటార్ సైకిళ్లపై గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితుల్ని పట్టుకుని వారి నుంచి రెండు మోటార్‌సైకిళ్లతో పాటు 10.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఐ వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. ఆయన కథనం.. తిరుపతి ఎస్పీ కే.పరమేశ్వర్‌రెడ్డి, నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇటీవల గంజాయి అక్రమరవాణాపై దృష్టి సారించామన్నారు. పట్టణంలోని సూళ్లూరుపేటకు చెందిన మొండెం శైలేష్, తెలంగాణాలోని వరంగల్ జిల్లా శివనగర్‌కు చెందిన మజ్జిగ అజయ్ సూళ్లూరులోనే నివాసముంటూ గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించామన్నారు. వీరిద్దరితో పాటు బుచ్చినాయుడుకండ్రిగ మండలం కల్లివెట్టు గ్రామానికి చెందిన కారణి సాయి రూ.85,850 విలువ చేసే 10 కేజీల గంజాయిని తీసుకొస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేసినట్టు పేర్కొన్నారు. వీరిని సోమవారం రాత్రి అరెస్ట్ చూపించగా జడ్జి 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పేర్కొన్నారు.

లోకేష్ పొర్లదండాల యాత్ర చేసినా ఫలితం శూన్యం

తిరుపతి కల్చరల్: చంద్రబాబు, లోకేష్‌బాబు అధికారం కోసం కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర కాదు పొర్ల దండాల యాత్ర చేసినా ఓటమి తప్పదని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి. ఆదికేశవులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 నియోజకవర్గాల్లోనూ విజయ ఢంగా మోగించడం ఖాయమని తెలిపారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డికి తెలంగాణ సీఎం స్పెషల్ చీఫ్ సెక్రటరీ పరామర్శ


ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తల్లి మునిరత్నమ్మను పరామర్శిస్తున్న తెలంగాణ సీఎం స్పెషల్ చీఫ్ సెక్రటరీ నరసింరావు దంపతులు

చంద్రగిరి: తెలంగాణ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి నరసింహారావు ఏపీ ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని పరామర్శించారు. మంగళవారం తుమ్మలగుంటకు చేరుకున్న ఆయన ఎమ్మెల్యే చెవిరెడ్డి తండ్రి సుబ్రమణ్యం రెడ్డి (మణిరెడ్డి) మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. మణిరెడ్డితో తనకున్న అనుబంధం, ఆత్మీయతను గుర్తుచేసుకుని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే చెవిరెడ్డితో పాటు ఆయన తల్లి మునిరత్నమ్మను ఆప్యాయంగా పలుకరించి మనో ధైర్యంగా జీవనం సాగించాలని ఓదార్చారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి రిమాండ్

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లను బ్లాక్‌లో అధిక ధరకు విక్రయించి భక్తులను మోసం చేసిన కేసులో ఇద్దరికి ఫిబ్రవరి 7వ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు మంగళవారం ఆదేశాలు జారీచేశారు. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, గుట్టకింద పల్లి హరిజనవాడకు చెందిన కలికిరి సుబ్రమణ్యం అలియాస్ రజినీకాంత్, తిరుపతి గిరిపురానికి చెందిన కలికిరి లోకేష్ కలిసి గుంటూరుకు చెందిన పొట్టి వెంకటశ్రీనివాసరావు అనే భక్తుడికి 4 వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లను 12 వేల రూపాయలకు విక్రయించారు. విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో ఇద్దరు నిందితులు కలిసి ప్రజాప్రతినిధుల లేఖల ద్వారా దర్శన టిక్కెట్లను పొంది భక్తులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. విజిలెన్స్ అధికారి శంకర్ బాబు ఫిర్యాదు మేరకు తిరుమల టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు ఉన్నట్లు పోలీసులు రిమాండ్ కోర్టులో పేర్కొన్నారు. అలాగే ఇద్దరు నిందితులు ఇదివరలో తిరుమలలో పలు చీటింగ్ కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు రిమాండ్ కోర్టులో పేర్కొన్నారు.

యూత్ ఫెస్ట్ విజేతలకు అభినందనలు


ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న మహిళావర్సిటీ ప్రతినిధులు

తిరుచానూరు: కర్ణాటక రాష్ట్రం హుబ్లీ ధార్వాడ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఈనెల 12 నుంచి 16 వరకు నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొన్న మహిళావర్సిటీ విద్యార్థి వలంటీర్లను శ్రీపద్మావతి మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని మంగళవారం అభినందించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ బ్యూరో తరపున ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా డాక్టర్ పి.మాధవి, యూనిట్-7, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఐవీఎస్ శ్రావ్య, జి.భవాని, నెహ్రూ యువకేంద్రం చిత్తూరు జిల్లా తరపున 12 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొన్నారు. అక్కడ జరిగిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభకు, యూత్ సమ్మిట్, యోగాథాన్, అడ్వెంచర్ స్పోర్ట్స్, ఆక్వా స్పోర్ట్స్, చిత్ర కళా పోటీలు, సంక్రాంతి సంబరాలు, మౌంటెన్ బైకింగ్, ఫుడ్ ఫెస్టివల్, ఖేలో ఇండియా అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ఈమేరకు వారిని రిజిస్ట్రార్‌తో పాటు మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జె.కాత్యాయిని విద్యార్థులను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఇంటిపై బెంగతోనే పారిపోయారు

- వీడిన గురుకుల బాలికల అదృశ్యం మిస్టరీ
- రాపూరు సీఐ కోటేశ్వరరావు

రాపూరు: ఇంటిపై బెంగతోనే రాపూరు బాలికల గురుకులం నుంచి సోమవారం రాత్రి బాలికలు పారిపోయినట్లు సీఐ కోటేశ్వరావు తెలిపారు. రాపూరు సీఐ కార్యాలయంలో మంగళవారం రాత్రి విలేకరులతో వారు మాట్లాడారు. గురుకులంలో 10వ తరగతి చదువుతున్న (పొదలకూరు మండలం, తోకంచికి చెందిన అంకిత, కలువాయి మండలం, దాచూరుకు చెందిన మల్లిక జ్యోతి, డక్కిలి మండలం, యల్లంపల్లికి చెందిన గాలి నాగమణి,)ముగ్గురు బాలికలు సోమవారం సంక్రాంతి సెలవల అనంతరం గురుకులంలో తల్లిదండ్రులు వదిలారని తెలిపారు. కుటుంబ సభ్యులమీద బెంగతో అదేరోజు రాత్రి ముగ్గురు బాలికలు గురుకులం వెనకవైపు నుంచి గోడ దూకి పారిపోయినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న గురుకులం సిబ్బంది, బాలికల తల్లితండ్రులు రాపూరు పోలీసులకు ఫిర్యాదు చేశారని, వారి ఫిర్యాదు మేరకు ఎస్పీ విజయరావు రాపూరు, కండలేరు, సైదాపురం స్టేషన్ల పరిధిలోని ముగ్గురు ఎస్ఐలను మూడు బృందాలుగా ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినారని, సీసీ ఫుటేజీల ద్వారా అందిన సమాచారం మేరకు వెంకటగిరిలో గాలింపు చర్యలు చేపట్టగా టీచర్స్ కాలనీలో బాలికలను గుర్తించినట్టు వెల్లడించారు. బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ కాంత్రికుమార్ ఉన్నారు.